# అమృతహస్తం

## గన్నవరపు నరసింహమూర్తి

"నారాయణా! రైల్వే బోర్డ్ ఛైర్మన్ కృష్ణమూర్తి గారు ఎల్లుండి ఇక్కడికి వస్తున్నారు. అతను 30 ఏళ్ళ క్రితం ఇక్కడే ఏ.ఈగా పని చేశారుట కదా! అప్పుడు నిన్ను బాగా తెలుసుట; నువ్వున్నావా లేదా అని భోగట్టా కూడా చేశారట; ఈ విషయం నీకు చెప్పమనీ ఏఈ దొరగారు చెప్పారు'' నారాయణ ఇంట్లోకి వస్తూనే అన్ని వివరాలు చెప్పేశాడు ఏఈ ఆఫీసు హెడ్‌క్లర్క్ కోటేశ్వర్రావ్.

నారాయణ అక్కడి రైల్వే ఆఫీసర్స్ రెస్ట్ హౌస్‌లో కుక్‌గా పనిచేసి క్రితం సంవత్సరమే పదవీ విరమణ చేశాడు. నారాయణ కొడుకు జనార్దనం ప్రస్తుతం గేంగ్ మేన్‌గా పనిచేస్తున్నాడు.

కృష్ణమూర్తిగారి పేరు వినగానే నారాయణకి తను రైల్వేలో జాయిన్ అయిన పాతరోజులు గుర్తుకొచ్చాయి. అప్పట్లో కృష్ణమూర్తిగారు అరకు సబ్ డివిజన్‌కు ఏఈగా ఉండేవారు. అటువంటి ఆయన ఇప్పుడు ఏకంగా రైల్వే బోర్డ్ ఛైర్మన్ అయ్యారన్నమాట; ఆ విషయం అతనికి చెప్పలేని ఆనందం కలిగించింది. అతనికి వారం రోజుల్నుంచీ ఒంట్లో బాగుండటంలేదు. విపరీతమైన జ్వరంతో మంచంపట్టేశాడు. ఈరోజే కొద్దిగా తగ్గుముఖం పట్టింది.

నారాయణకి ఒక్కడే కొడుకు జనార్దనం; సంవత్సరం క్రితం అతనితో తగవుపడి ఇంట్లోంచి భార్యా, పిల్లాడితో కలసి బయటకువెళ్ళిపోయాడు. వాడు పదవ తరగతిలో ఫెయిల్ అయి చెడు తిరుగుళ్ళు తిరుగుతుంటే అప్పటి ఏ.ఈ గారి కాళ్ళు పట్టుకొని గేంగ్‌లో ఉద్యోగం వేయించాడు నారాయణ. ఆ మరుసటి సంవత్సరం గేంగ్ మేస్త్రీ రాజయ్య కూతురు రాణితో పెళ్ళి కూడా చేశాడు.

ఆ తరువాత మూడు సంవత్సరాలపాటు ఉద్యోగం సరిగ్గానే చేశాడు జనార్దనం. ఆ తరువాత మెల్లమెల్లగా తాగుడికి అలవాటుపడ్డాడు. పేకాటలో ఎన్నో వేలు పోగొట్టుకొని చాలామంది దగ్గర అప్పులు చేశాడు. ఈ విషయం తెలిసి నారాయణ కొడుకుని హెచ్చరించినా వాడు వినిపించుకోలేదు.

నారాయణ అక్కడ అధికారుల విశ్రాంతి గృహంలో ముప్ఫై సంవత్సరాలు కుక్‌గా పనిచేసి ఎంతో మంచి పేరు సంపాదించుకున్నాడు. అతని మంచితనంవల్లే జనార్దనానికి ఉద్యోగం వచ్చింది. లేకపోతే పదవ తరగతి పోయినవాడికెవరు ఉద్యోగం ఇస్తారు? కానీ వాడికా ఉద్యోగం విలువ తెలియటంలేదు.

ఇప్పటికే  డ్యూటీలో ఎన్నోసార్లు తప్పులు చేసి సస్పెండ్ అయ్యాడు. అన్ని సార్లు నారాయణ పై అధికారుల్ని కలసి వాడిని మళ్ళీ డ్యూటీలోకి తీసుకునేటట్లు చేశాడు.

నాలుగేళ్ళక్రితం ఒకరోజు డ్యూటీలో విపరీతంగా తాగేసి తోటి గేంగ్ వాణ్ణి కొట్టడంతో జనార్దనాన్ని సస్పెండ్ చేశారు. ఈ విషయం తెలిసి భార్య అచ్చెమ్మ, కోడలు రాణి ఏడుస్తుంటే నారాయణ ఏ.ఈ దొరగారిని కలసి వాడు ఇకమీదట తప్పులు చేయకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో వాణ్ణి మళ్ళీ డ్యూటీలోకి తీసుకున్నారు.జనార్దనం చేసిన అప్పులు తీర్చడానికి నారాయణ తను ఎంతో జాగ్రత్తగా దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్ లోంచి లోనుపెట్టి ఆ అప్పులు తీర్చాడు.

వాడు ఉద్యోగం చేస్తున్నాడన్న మాటేగాని జీతం డబ్బులు ఒక్క నెల కూడా ఇంటికి ఇవ్వలేదు. అతని భార్యని, పిల్లవాణ్ణి తండ్రి నారాయణే పోషించేవాడు. జీతం అందిన వారం రోజుల దాకా కనిపించేవాడు కాడు జనార్దనం. ఆ డబ్బులన్నీ ఖర్చైపోయాక ఇల్లు గుర్తు కొచ్చేది.

మరీ ముఖ్యంగా రెండేళ్ళనుంచి వాడి ప్రవర్తనలో విపరీతమైన మార్పొచ్చింది. రోజూ తాగి వచ్చి నానా యాగీ చేస్తుండేవాడు. అడ్డుపడితే పెళ్ళాన్ని కూడా కొట్టేవాడు.

ఇంకోసారి నైట్ పెట్రోలింగ్ డ్యూటీ చేస్తూ తాగి పడిపోయాడు. ఆ రాత్రి విపరీతంగా పడ్డ వర్షానికి కరక వలస స్టేషన్ దగ్గర కటింగ్‌లో కొండమీద నుంచి బండ రాళ్ళు పడిపోవడంతో గూడ్స్‌బండి పట్టాలు తప్పి పెద్ద ప్రమాదం జరిగింది. విచారణలో జనార్దనం తాగి సరిగ్గా విధులు నిర్వహించకపోవడంవల్లే ప్రమాదం జరిగిందని తేలడంతో మళ్ళీ అతన్ని సస్పెండ్ చేశారు.

ఈసారి ప్రమాదం పెద్దది కావడంవల్లనూ, అదీగాక రైల్వేకు పెద్ద మొత్తంలో నష్టం జరగడంవల్లనూ రెండు నెలలైనా వాణ్ణి డ్యూటీలోకి తీసుకోలేదు. తోటి ఉద్యోగులంతా నారాయణ దగ్గరకు వచ్చి ఏ.ఈ దొరగారితో చెబితే వాణ్ణి డ్యూటీలోకి తీసుకుంటారని చెప్పారు. కానీ నారాయణకి మొహమాటం వేసింది. ఇప్పటికే ఎన్నోసార్లు ఆ పని చేశాడు.

తను ముప్పై ఏళ్ళ నుంచి సంపాదించిన మంచితనం ఇలాంటి పైరవీలకు ఉపయోగించడం అతనికి నచ్చలేదు. వాడి ఉద్యోగం పోయినా ఫరవాలేదు కానీ అతన్ని కలవ ననీ కరాఖండీగా చెప్పాడు. కానీ నారాయణ బాధపడు తున్న విషయాన్ని ఏ.ఈ గారికి తెలిసి మళ్ళీ అతన్ని డ్యూటీలోకి తీసు కున్నారు. అయినా జనార్దనంలో మార్పురాలేదు.

క్రితం సంవత్సరమే నారాయణ పదవీ విరమణ చేశాడు. రైల్వే కాలనీకి దగ్గర్లోనే చిన్న ఇల్లు కట్టుకొని భార్యతో సహా అందులోకి దూరిపోయాడు. తన రైల్వే క్వార్టర్‌ని కొడుకు జనార్థనంకి ఎలాట్ చేయించాడు. నారాయణ జనార్దనం కుటుంబం నుంచి వేరు వెళ్ళి పోవడంతో జనార్దనం పరిస్థితి మరింత దిగజారింది.

ఇన్నాళ్ళూ తండ్రి దగ్గర భయంతో కొన్నాళ్ళైనా విధులు సరిగ్గా చేసేవాడు. ఇప్పుడు ఆ అడ్డులేకపోవ డంతో రోజూ తాగుతూ డ్యూటీకి వెళ్ళడం మానేసాడు. తాగితందనాలు ఆడుతూ కుటుంబం గురించి పట్టించు కోకపోవడంతో వాడిపెళ్ళాం రాణి పిల్లవాణ్ణి తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. ఈ విషయం తెలిసిన నారా యణకి ఏం చెయ్యాలో తోచలేదు. ఏంచేస్తే కొడుకు బాగుపడతాడో అతనికి అర్థంకావట్లేదు.

ఇదిలా ఉండగా రెండు నెలలక్రితం జనార్దనం రాత్రి పెట్రోల్ డ్యూటీ చేస్తుండగా టన్నెల్ నెంబరు నలభై

## జ్ఞాపకాలు

చివరిదాకా మిగిలేది
తాతకు అవ్వాకాదు
అవ్వకు తాతా కాదు
వాళ్ళిద్దరికీ బువ్వా కాదు
ఒకరికి చేతి కర్ర
మరొకరికి మరచెంబు

## పడగ

పడగ విప్పితే
నాగేశ్వరుడు
పడగ వెత్తితే
కోటేశ్వరుడు

## వృష్టి

ఒకచోట
కుండపోత
మరొక్కచోట
గుండెకోత!

## ప్రత్యేక 'సంచి'క

ఉండాల్సింది
చేతి సంచినిండా కాదు
నిండాల్సింది
జాతి గుండెనిండా!

## ఔనుమరి

బ్రతికున్నప్పుడు
వదలరు అప్పులవాళ్ళు
చచ్చినప్పుడు
విడువరు డప్పులవాళ్ళు
చచ్చినాలేదు
మనిషికి సుఖం!

తెలికపల్లి సాంబశివరావు

# నిశీధిలో బాణం

ఆకాశమంత పందిరి కింద
కాశమంత భూదేహం
ఉక్కుపిడికిళ్ళ కంచెలో
బలవంతుని బానిస!
నల్ల నీగ్రోకి స్వాతంత్ర్యం
వచ్చినంత అల్గ్గానే
నా దేశానికి స్వాతంత్ర్యం
భోక్తలు మాత్రం నిస్సందేహంగా
బలిసిన కీచకులే!
నల్లరేగడి దేహం
పిడికిళ్ళు ఛేదించిన వైనం
నిజమో, కలో, వైష్ణవమాయో
పొలంలో హలం మోస్తున్న
తరాలనాటి బక్కటెద్దుల
సంకెళ్ళ పోరాటం
నిరంతరంగా... నిశీధిలో బాణంలా...!

— ఏటూరి నాగేంద్రరావు

ముందు భాగం పూర్తిగా మట్టితో కప్పబడిపోయింది. అప్పటికి రెండురోజుల నుంచీ భారీగా వర్షం కురుస్తుండడంతో టన్నెల్‌మీద కొండ కుప్పకూలిపోయింది.

ఆ సమయంలో డ్యూటీలో ఉన్న జనార్దనం తాగడానికి అక్కడికి దగ్గర్లోనే పల్లెకి వెళ్ళిపోవడంతో ఆ మట్టిపడ్డ విషయం డ్రైవర్‌కి ముందే హెచ్చరించకపోవడంవల్ల ఇనుప ఖనిజం లోడుతో వస్తున్న డౌన్ ట్రైన్ మళ్ళీ భారీ ప్రమాదానికి గురైంది. విచారణలో జనార్ధనం డ్యూటీ సరిగ్గా నిర్వహించకపోవడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని తేలడంతో అతన్ని మళ్ళీ సస్పెండ్ చేశారు. ఈసారి వాణ్ణి ఉద్యోగంలోంచి పూర్తిగా తొలగించబడటం ఖాయం అని అనుకున్నారందరూ. వాణ్ణి కాపాడటం ఇంక ఎవ్వరితరం కాదు అని అందరికీ తెలిసిపోయింది.

ఈ విషయం తెలిసిన నారాయణ బాధపడలేదు. వాడికి తగిన శాస్తే జరిగిందనుకున్నాడు. కానీ లోలోపల మాత్రం అతనికన్న పేగు వాణ్ణి ఎలాగైనా రక్షించాలని కోరుకొంటోంది; కానీ ఎలా?!... అలా బాధపడుతూ నారాయణ మంచం పట్టేశాడు. తన పదవీ విరమణతో పాటు కొడుకు జీవితం అలా అయిపోయినందుకు నారాయణ బెంగపెట్టుకొని శుష్కించిపోసాగాడు; ఇంక ఆ కుటుంబాన్ని రక్షించే దిక్కెవరనీ అతని భయం!

అటువంటి సమయంలో కృష్ణమూర్తి దొరగారు రైల్వే బోర్డ్ ఛైర్మన్ హోదాలో ఆ ఊరికి వస్తున్నారన్న వార్త తెలిసింది. అందులోనూ తన గురించి ఆ పెద్దాయన ఆరా తీసి అడిగారన్న విషయం అతనికి మరింత ఆనందం కలిగించింది. అతనికి తను ముప్ఫై ఏళ్ళ క్రితం రైల్వేలో జాయిన్ అయిన తొలిరోజులు గుర్తుకు రాసాగాయి.

❖ ❖ ❖

పాతికేళ్ళ వయసులో అరకు ప్రాంతం వచ్చాడు నారాయణ. అప్పటికే అతని తల్లిదండ్రులు చని పోయారు. కొత్త వలస నుంచీ కిరండూల్ దాకా రైల్వే లైన్ వేస్తున్నారనీ, అక్కడికెళ్తే రోజూ పనిదొరుకుతుందనీ ఎవరో చెబితే అక్కడికి వచ్చాడు. అప్పటికే అక్కడి రైల్వే లైను పనులు ఉధృతంగా జరుగుతున్నాయ్. కొండల్ని దొలిచి టన్నెల్స్ నిర్మిస్తున్నారు. ముప్ఫై మీటర్ల ఎత్తైన మట్టికట్టల్ని వేస్తున్నారు.

అరకులో రైల్వే ఉద్యోగుల కోసం పెద్ద కాలనీ నిర్మించింది రైల్వే శాఖ. అక్కడ అధికారులకోసం ఒక విశ్రాంతి గృహం కూడా నిర్మించారు. అందులో అసిస్టెంట్ ఇంజనీర్ల నుంచీ ఛీఫ్ ఇంజనీర్ స్థాయిదాకా పెద్ద అధికార్లు ఉండేవారు. మొదట్లో నారాయణ పెద్ద వంతెనలు నిర్మించే కాంట్రాక్టర్ దగ్గర పనికి కుదిరాడు. అతనికి వంట చెయ్యడం బాగా రావడంతో మెస్ పనులను అతనికి అప్ప చెప్పారు. అది అటవీ ప్రాంతం కావడంతో అతని మెస్‌లో కంట్రాక్టర్ మనుషులే కాక తనిఖీల నిమిత్తం వచ్చే రైల్వే అధికారులు కూడా భోజనాలు చేసేవారు.

ఒకరోజు నారాయణ మెస్‌కి వంతెన పనులను పర్యవేక్షించడానికి వచ్చిన ఛీఫ్ ఇంజనీర్ భోజనం చేశాడు. అతనికి ఆ భోజనం బాగా నచ్చడంతో కాంట్రాక్టర్‌తో చెప్పి తనతో బాటు నారాయణని అరుకు తీసికెళ్ళి రైల్వే అధికారుల విశ్రాంతి గృహంలో కుక్‌గా అపాయింట్‌మెంట్ ఇచ్చాడు. అక్కడ నారాయణ రోజూ రైల్వే అధికారులకు మూడు పూటలా భోజన సదుపాయములు చూడటమేకాకుండా ఆ రెస్ట్ హౌస్‌కి కేర్ టేకర్‌గా వ్యవహరించేవాడు.

కొద్ది రోజుల్లోనే నారాయణ తన మంచితనంతో అందరి అధికారుల మన్ననలను అందుకున్నాడు. అతని ఉద్యోగాన్ని ఆ ఛీఫ్ ఇంజనీర్ వెళ్ళిపోయే ముందు

పర్మినెంట్ చేసి మరీ వెళ్ళిపోయాడు. మరో రెండేళ్ళకు రైల్వే లైను నిర్మాణం పనులు పూర్తై, రైళ్ళు తిరగడం మొదలయ్యాయి.

అరుకులో రైల్వే లైనుని నిర్వహించడానికి ఒక అసిస్టెంట్ ఇంజనీర్ని నియమించారు. ఆ విధంగా అరుకు ఒక సబ్-డివిజన్ కేంద్రం అయింది. అదీగాక అరుకు లోయ ఒక పర్యాటక కేంద్రం కావడంతో చాలా మంది అధికారులు కలకత్తా, ఢిల్లీలనుంచి వస్తుండేవారు. దాంతో నారాయణకి ఊపిరిసలపనంత పని ఉండేది. ఆ విదంగా ఆ రెస్ట్ హౌస్‌లో ఉండటంవల్ల పెద్ద పెద్ద అధి కార్లకి సేవచేసే భాగ్యం అతనికి కలిగింది.

చాలామంది అధికారులకు నారాయణంటే ఎంతో అభిమానం ఏర్పడింది. మరో రెండు సంవత్సరాలకు నారాయణ ఆ ప్రాంతానికి చెందిన ఓ గిరిజన అమ్మా యిని పెళ్ళి చేసుకున్నాడు. మరో సంవత్సరానికి జనా ర్దనం పుట్టాడు.

ఆ సమయంలో అరుకు సెక్షన్‌కి కృష్ణమూర్తి అసి స్టెంట్ ఇంజనీర్‌గా వచ్చాడు. కొద్ది రోజుల్లోనే స్ట్రిక్ట్ ఆఫీసర్ అనే పేరు సంపాదించుకున్నాడు. అతని అవివాహితుడు కావడంతో రెస్ట్ హౌస్‌లోనే ఉండేవాడు. అతని భోజన సదుపాయాలన్నీ నారాయణే చూసేవాడు.

కానీ దురదృష్టవశాత్తు వచ్చిన కొద్ది రోజులకే కృష్ణ మూర్తి పచ్చకామెర్ల వ్యాధికి గురయ్యాడు. ఆ సమ యంలో నారాయణ అతన్ని కంటికి రెప్పలా కాప్పాడ్డంతో అతను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. అప్ప ట్నుంచీ కృష్ణమూర్తికి నారాయణంటే ప్రాణం! మరో రెండు నెలలకు అతను పెళ్ళి చేసుకున్నాడు.

అతను నారాయణని తన పెళ్ళికి కూడా తీసు కెళ్ళాడు. అందరితోనూ నారాయణ తన ప్రాణదాత అనే చెబుతూ ఉండేవాడు. ఈలోగా అతనికి డివిజనల్ ఇంజ నీర్‌గా ప్రమోషన్ రావడంతో కలకత్తా వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిపోతున్న వార్త విన్న నారాయణకి చాలా బాధ వేసింది. అంతమంచి అధికారిని అతనెప్పుడూ చూడ లేదు. వెళ్ళిపోతూ అతను నారయణని ఏదైనా సహాయం కావాలంటే అడగమనీ చెప్పాడు.

నారాయణకి మొదటి నుంచీ ఆత్మాభిమానం చాలా హెచ్చు. అందుకే దాన్ని సున్నితంగా తిరస్కరించాడు. భారమైన హృదయంతో ఆ కుటుంబానికి నారాయణ వీడ్కోలు పలికాడు.

❖ ❖ ❖

ఆ రోజు తరువాత మళ్ళీ ఇన్నాళ్ళకు కృష్ణమూర్తిగారి పేరు విన్నాడు నారాయణ. ఈ నలభై సంవత్సరాల ఉద్యోగ జీవితంలో ఎందరో అధికారులను చూశాడు గానీ కృష్ణమూర్తిగారిలాంటి సహృదయుణ్ణి అతను ఏనాడూ చూడలేదు. అతనితో ఉన్న అనుబంధం ఇంకె వరితోనూ ఏర్పడలేదు. ఇప్పుడా కృష్ణమూర్తిగారు రైల్వే బోర్డ్ ఛైర్మన్ అయి ఇక్కడకు వస్తున్నారన్న వార్త అతనికి అమితమైన ఆనందాన్ని కలిగించింది.

కానీ అందరికి ఆశ్చర్యం కలిగిస్తున్న విషయం అతను నారాయణ గురించి వాకబు చేయడం, అతన్ని కలవా లన్న కోరికను వెలిబుచ్చడం.

అందుకనుగుణంగా అసిస్టెంట్ ఇంజనీర్ పావన

## చేనేత బాల

ఒక దినంబు నేను శోకసాగరమును
పల్లెటూరుకేగ పయనమైతి
దారియంత ఊరి దారిద్ర్యమును జెప్పు
నట్టులుండ కాలి నడక సాగె
అంతలోన గుడిసెనగుపించె నల్లంత
దూరమందు దుమ్ము ధూళి నిండి
అతని తనువు జూడ అస్తిపంజరమాయె
కూలి పోవు హోరు గాలికైన
ఖంగు ఖంగుమనుచు బొంగురు
గొంతుతో
బాధపడెడునొక్క పద్మశాలి
నేయుచున్న దియబల! చేనేత బాల!
చేతివ్రేళ్ళంత నా జూకొ చెప్పవశమె
తినగ నొకపూట బుక్కెడు తిండిలేక
కట్టుకొననొక జానెడు గుడ్డలేక
యిడ్వలేని యా బ్రతుకుల కేడ్వలేక
కార్చుచున్నారు కన్నీటి కాల్వలాయె
అకట ఈ వృత్తియందున అన్నమేది?
పంచభక్ష్యాలు భుజియించు భాగ్యమేది?
పగలు రాత్రిళ్ళు నేసినా పస్తులాయె
వెట్టిచాకిరీ బ్రతుకుల వెతలెయాయె

పున్న అంజయ్య

## ఆ రెండు

ఒకానొకప్పుడు
కష్టానికి ఆసరా ఆ రెండు చేతులు
నేడు కాష్టంలో కాలుతున్నా
కాసులకు కాపలా ఆ రెండుకళ్ళు

## అనంతం

కడలి ఒకటే
కెరటాలు అనేకం...
కవి ఒకడే
భావాలు అనంతం
నేను ఒక్కటే
నాలో నువ్వు సమస్తం...!!

## ఒంటరిదే

సృష్టిని నడిపించే
కాలం ఒంటరిది
ప్రేమించే హృదయం
ఎప్పటికీ ఒంటరిదే...

శైలజామిత్ర

రావుకి హెడ్డాఫీసు నుంచి అందుకు తగ్గ ఏర్పాట్లు చెయ్యమని ఆదేశాలు వచ్చాయి. అందుకే తన ఆఫీసు హెడ్‌క్లర్క్ కోటేశ్వర్రావ్ ద్వారా నారాయణకి కబురు పంపాడు అతను.

అనుకున్న ప్రకారం రెండురోజుల తరువాత కృష్ణమూర్తి గారు కుటుంబంతో సహా అరుకుకి స్పెషల్ రైలులో వచ్చారు.

వచ్చిన రోజు తనిఖీలు పూర్తవగానే ఆ సాయంత్రం నారాయణ గురించి ఆరా తీశాడతను. కానీ పావనరావు అతను పదవీ విరమణ చేశాడనీ ప్రస్తుతం అనారోగ్యంతో మంచంమీద లేవలేని స్థితిలో ఉన్న విషయాన్ని చెప్పడంతో కృష్ణమూర్తి గారికి బాధవేసింది. వెంటనే అతను పావనరావుతో కలసి నారాయణింటికి వెళ్ళాడు.

కృష్ణమూర్తి గారిని చూడగానే నారాయణకి నోట మాటరాలేదు. భారతరైల్వేలంతటికీ పెద్ద అధికారి అయిన అతను తనవంటి రిటైరైన చిన్న ఉద్యోగి ఇంటికి రావడం అతనికి ఆశ్చర్యం కలిగిస్తోంది. అతడి మస్తిష్కం పనిచెయ్యడం మానేసింది. వెంటనే మంచంమీద నుంచి లేవబోయాడు. కానీ అతను నారాయణని వారించి యోగ క్షేమాలు కనుక్కున్నాడు.

ఆ తరువాత ఏ.ఈ పావనరావుతో "మిస్టర్ పావన్! ఇక్కడ ముప్ఫైఏళ్ళ క్రితం నేను ఏ.ఈగా జాయిన్ అయిన కొత్తలో నన్ను ఈ నారాయణ కంటికి రెప్పలా చూసుకున్నాడు. తన అమృత హస్తంతో మూడు సంవత్సరాలు నాకు వండి పెట్టి మా అమ్మని మరిపించాడు. నాకు కామెర్లు వస్తే కంటికి రెప్పలా దాని బారి నుండి కాపాడాడు. అందుకే ఇతన్ని నేనెప్పుడూ మరచిపోలేను.

నేను పదవీ విరమణ చేసేముందు మొదటిసారిగా నేను పనిచేసిన ప్రాంతాన్ని ఉండే ఇంటినీ మా కుటుంబానికి ముఖ్యంగా నా ప్రాణాల్ని కాపాడిన ఈ నారాయణని చూపించాలనీ ఇక్కడికి వచ్చాను. నాకు కూడా అతన్నెందుకో చూడాలనిపించింది.

## మనది

స్వాతంత్ర్యం కోసం పోరాడిన
బాపూజీని హతమార్చిన దేశం మనది!
జీవిత వైషమ్యాలను పెంచి పోషించే
రాబందులున్న రాజ్యం మనది!
గరీబీ హటావో నినాదాలిచ్చిన
మాతృమూర్తిని కడతేర్చిన జాతి మనది!
కులమతాల అగ్నిజ్వాలలతో
హింసలు సృష్టించే ఘన చరిత్ర మనది!
దేశం కోసం అహరాం కృషి చేసిన
రాజీవ్‌ను రాపాడిన రాక్షసులున్న దేశం మనది!
అహింసో పరమో ధర్మమంటూనే
అయినకాడికి మట్టుబెట్టే ఘనులున్న దేశం మనది!
ఇంకెక్కడి రామరాజ్యం అదంతా బూటకం!
జాతి చరితను తిరగరాసే ఉదారత మనది!
కాడిపట్టి కాలు దువ్వి కదనరంగాన
మేడిపట్టి మెడలు వంచి
అరాచకాన్ని అడ్డుకట్టవేయాలి మనం!

ఆచార్య నరేంద్ర

మొదటిసారిగా ఈ కొండల్లో తల్లిదండ్రులకు దూరంగా పనిచెయ్యడం కష్టం అనుకుంటున్న సమయంలో ఇతనే నాకు ధైర్యం నూరిపోశాడు. నాకు ఈ రైల్వే పట్ల, ఉద్యోగం పట్ల ప్రేమ కలిగించాడు. ఆనాడు అతనా పని చేసి ఉండకపోతే నేనీనాడు ఈ పదవికి వచ్చి వుండేవాణ్ణి కాను. ఇతనిది అమృతహస్తం!

ఆ తరువాత ఎందుకో నాకీ ప్రాంతం అంటే చాలా అభిమానం! ఇప్పుడు రాకపోతే మళ్ళీ జీవితంలో రాలేనని ఇలా వచ్చాను'' అంటూ నారాయణతోను, ఆ ప్రాంతంతోనూ తనకుండే అనుబంధాన్ని విడమరచి చెప్పాడాయన.

మరో గంట తరువాత అతను వెళ్ళిపోవడానికి లేస్తూ ''నారాయణా! నీకేమైనా సహాయం కావాలంటే మొహమాటపడకుండా అడుగు; మనఃస్ఫూర్తిగా చేస్తాను; అది నా బాధ్యత'' అన్నాడు.

ఆ మాటలు విన్న నారాయణకి నోట మాటలు రాలేదు. కానీ ఆ క్షణంలో అతనికి తన కొడుకు జనార్ధనం గుర్తుకొచ్చాడు; ఆ సమయంలోఅతనికి తన కొడుకు గురించి చెబితే వాడికి తిరిగి ఉద్యోగం వస్తుంది.

అంత పెద్ద దొర చెబితే అదేం పెద్ద విషయం కాదు; వాణ్ణి వెంటనే ఉద్యోగంలోకి తీసుకుంటారు. కానీ ఆ సమయంలో అంత పెద్దాయన్ని ఇలాంటి స్వార్ధపూరితమైన కోరిక కోరడం తప్పనిపించింది నారాయణకి. అందుకే తనకేమీ కోరికలు లేవనీ, అతను రావడమే తనకు ఎంతో ఆనందం కలిగించిందనీ చెబుతూ రెండు చేతులు జోడించాడు.

కృష్ణమూర్తి గారు, పావనరావుతో కలసి వెళ్ళిపోయారు.

❖ ❖ ❖

అతను వెళ్ళిపోయిన మూడురోజుల తరువాత ఏ.ఈ ఆఫీసు క్లర్కు కోటేశ్వర్రావ్ నారాయణింటికి వచ్చి చెప్పాడు.

''నారాయణా! ఛైర్మన్ దొరగారిని నువ్వేం కోరకపోయినా నీ కొడుకు జనార్ధనం సస్పెండైన విషయం ఏ.ఈ గారి ద్వారా తెలుసుకొని వాణ్ణి తిరిగి విధుల్లోకి తీసుకొమ్మనీ ఆర్డర్స్ ఇచ్చారు. కాకపోతే ఇకనుంచి జనార్ధనం గేంగులో కాక ఆఫీసులో అటెండర్‌గా పని చేస్తాడు. ఇకవాడి ఉద్యోగానికేమీ ప్రమాదం ఉండదు. నీకు నయం అయ్యేదాకా విశాఖపట్నంలో మన రైల్వే ఆసుపత్రిలో వైద్యం చేయించమని కూడా చెప్పారు''

ఆ శుభవార్త విన్న నారాయణ కృష్ణమూర్తి గారికి మనస్సులోనే కృతజ్ఞతలు చెప్పాడు. అతను అన్నట్లుగా తనది అమృతహస్తం కాదు. తనలాంటి వాళ్ళను ఆదుకొనే అతనిదే 'అమృతహస్తం' అనుకున్నాడు. ■

## శుభప్రవేశం

అతణ్ణి అడిగాను
రాజకీయాల్లోకి
ఎందుకొచ్చావని
అతనన్నాడు
'అచ్చమైన ప్రజాసేవ కోసం
అని.
నేనన్నాను
'శఃభాష్;
చాలా చక్కటి
అబద్ధంతో మొదలెట్టావు
రాజకీయాల్లో
తప్పక రాణిస్తావ్'

కేయస్లైన్

## కాగడాలు

ఆత్మీయంగా అల్లుకున్నా
మల్లెపూల సుగుణత్వం
ముళ్ళపొదలు గ్రహించలేవు
ఎంత శిక్షణ పొందిన
కోకిల గానం
కాకులు వినిపించలేవు
ఎన్ని మెరుగులు దిద్దిన
పుత్తడి తళుకులు
ఇత్తడి మెరిపించదు
నిర్భయంగా మెడలో వేసుకున్నా
బుసకొట్టే భుజంగరాజం
భూషణమై శోభిల్లదు

కనపర్తి రాజశేఖరమ్